ప్రజాశక్తి
ఆదివారం 16 ఫిబ్రవరి, 2025
5
శ్రీకాకుళం



దరఖాస్తుల ఆహ్వానం

పలాస : పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి ప్రాజెక్టులో ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారంతా ధరఖాస్తు చేసుకోవాలని జార్జిఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఉద్దాన ప్రాంతంలో రక్త నమూనాలను ప్రోత్సహించడానికి, డేటా సేకరణ, గుర్తింపు, నమోదు చేసేందుకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత, ఉద్దాన మండలాల్లో నివాసం ఉండేవారు అర్హులని అన్నారు. పూర్తి వివరాలకు కిడ్నీ ఆస్పత్రి పరిశోధన కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు cureckdu.cv@gmail.comకు దరఖాస్తులు పంపించాలని, కార్యాలయంలో అందజేయాలని కోరారు.

అర్ధరాత్రి ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ఆమదాలవలస, నరసన్నపేట పోలీస్‌స్టేషన్ల సందర్శన



ఆమదాలవలస : పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- ఆమదాలవలస, నరసన్నపేట

రాత్రి పూట వచ్చే డయల్ 100,112 కాల్స్ పట్ల తక్షణమే స్పందించాలని, నేరాలు నియంత్రణకు రాత్రిపూట గస్తీ విధులు అప్రమత్తంగా నిర్వర్తించాలని పోలీస్ సిబ్బందిని ఎస్‌పి కె.వి.మహేశ్వ రరెడ్డి ఆదేశించారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటి, రెండు గంటల సమయంలో ఆమదాలవలస, నరసన్నపేట పోలీస్ స్టేషన్ల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో స్టేషన్లలో రాత్రి పహారా (సెంట్రి) సిబ్బంది, ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో కేటాయించిన బీట్లు సిబ్బంది, తిరిగే బీట్ పాయింట్లపై ఆరా తీశారు. బీట్ సిబ్బంది అప్ర మత్తంగా, పకడ్బందీగా గస్తీ విధులు నిర్వర్తించాలని సూచించారు. సెంట్రీ కానిస్టేబుల్ అప్రమత్తంగా ఉంటూ జిల్లా పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే డయల్ 100, 112 కాల్స్‌పై తక్షణమే స్పందించాలన్నారు. ఆయా పరిధిలోని బీట్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ సంబంధిత ఫిర్యాదితో ఫోన్ ద్వారా మాట్లాడి బాధితులు ఉన్న చోటకు చేరుకుని సమస్య పరిష్కారానికి నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి వేళలో ఆపదతో పోలీస్‌స్టేషన్‌కి వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టే దిశగా విధులు నిర్వర్తించి, ప్రతి విషయాన్నీ అధికారులకు తెలియజేయాలన్నారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని, వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించి నేర నియంత్రణ చర్యలు చేపట్టాలని, బీట్ సిబ్బంది విధులు నిర్వర్తించాలని సూచించారు.

హై వే పెట్రోలింగ్ తనిఖీ

ఆమదాలవలస, నర్సన్నపేట పోలీస్ స్టేషన్లు తనిఖీ అనంతరం నర్సన్నపేట–శ్రీకాకుళం మార్గంమధ్యలో ఉన్న హైవే పెట్రోలింగ్ వాహనాన్ని తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. నిరంతరం వాహన తనిఖీలు చేస్తూ, అనుమానిత వ్యక్తులను ప్రశ్నిస్తూ ఉండాలన్నారు. పశువుల అక్రమ రవాణా చేసే వాహనాలు గుర్తించి సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు అప్పగించాలని సూచించారు. రాత్రి వేళలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటాయని, టోల్ ప్లాజాల వద్ద వాహనా చోదకులకు ఫేస్ వాష్ నిర్వహించాలని అన్నారు. 24బై7 నిరంతరం జాతీయ రహదారిపై పెట్రోలింగ్ వాహనంతో గస్తీ నిర్వహిస్తూ అక్రమ రవాణా, ఇతర నేరాలు నియంత్రణకు పట్టిష్టంగా విధులు నిర్వహించాలన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం



సమీక్షిస్తున్న సీతారాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మార్చి 1 నుంచి 20 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. నగరంలో ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలోని జిల్లా ప్రాంతీయ కార్యాలయంలో ఆర్ఐఒ పి.దుర్గారావు సారథ్యంలో జిల్లా పర్యవేక్షణ అధికారులతో, పరీక్ష కమిటీ సభ్యులతో, ప్రిన్సిపాళ్లతో, ఫ్లయింగ్ స్క్వాడ్, వివిధ శాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరంలో ఎన్ని పరీక్షా కేంద్రాలు, జోన్లు ఏర్పాటు, హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య ఎంత, వీరిలో బాలికలు, బాలురు ఎంతమంది, ఎన్ని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల కేటాయింపు, తాగునీటి సదుపాయం, చక్కని వెలుతురు, పరిశ్రుభవంతమైన మరుగుదొడ్లు, ఫ్యాన్లు, సరిపడినన్ని బెంచ్‌లు, కుర్చీలు ఏర్పాటు చేసేలా సంబంధిత కళాశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేశారా? పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాల పరిధిలో విద్యుత్ సమస్యలు లేకుండా, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖాధికారుల దృష్టికి తెచ్చారా? మారుమూల ప్రాంతాల్లోని కళాశాలలకు హాజరయ్యే విద్యార్థులకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా విరివిగా బస్సులు ఏర్పాటు చేసేందుకు ఆర్‌టిసి అధికారులకు ముందస్తు ప్రణాళికలు అందజేశారా? ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసుశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారా? పరీక్ష కేంద్రాల ప్రాంగణాల్లో ప్రాథమిక వైద్యంతో ముడిపడి ఉండేలా సరిపడా మందులతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసేలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారితో సంప్రదించా? సిసి కెమెరాలు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారన్నదానిపై ఆరా తీశారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలున్నాయా; వాటిపై ఎటువంటి చర్యలు చేపడుతున్నారు తదితర అంశాలపై సుదీర్ఘంగా అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.దుర్గారావు మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి తగు సలహాలు సూచనలు అందజేశారు అన్నారు. ఆర్ఐఒ దుర్గారావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల నుంచి మొదటి, రెండో సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులు 75 పరీక్ష కేంద్రాల నుంచి 40,356 మంది, వీరిలో ఒకేషనల్ 2380 మంది హాజరవుతున్నారని తెలిపారు. పర్యవేక్షణకు 1600 మంది ఇన్విజిలేటర్లు, 1480 సిసి కెమెరాలు అమర్చుతున్నామని వివరించారు, సమావేశంలో జిల్లా పరీక్ష కమిటీ సభ్యులు భీమేశ్వరరావు, నారాయణరావు, సింహాచలం, శ్యాం ఎం.వాసుదేవ కుమార్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

విజయగౌరి గెలుపు విద్యారంగానికి మలుపు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- మందస

ఉపాధ్యాయ వ్యవస్థలో పేరుకుపోయి ఉన్న అనేక అపరిష్కృత సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేసే వ్యక్తి ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు అన్నారు. మందస మండల యుటిఎఫ్‌శాఖ ఆధ్వర్యాన మండలంలోని హరిపురంలో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన విద్యా విధానంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారని అన్నారు. పిల్లలు చదువుకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉపాధ్యాయులపై పని భారం, ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలతో పాటు ఇతర అనేక సమస్యలపై పోరాడిన అనుభవం విజయగౌరికి ఉందన్నారు. మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతారని అన్నారు. రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కిషోర్‌కుమార్, జయచంద్రారెడ్డి మాట్లాడుతూ చట్టసభలో ప్రభుత్వాన్ని నిలదీసి విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారినే ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని తెలియజేశారు. అటువంటి పోరాట పటిమ కలిగినటువంటి ఎమ్మెల్సీలు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే అని అన్నారు. ఉత్తరాంధ్ర నుంచి మొదటిసారిగా పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, జిల్లా అకడమిక్ సెల్ కో–కన్వీనర్ కంచరాన మాధవరావు, మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, సహాధ్యక్షులు జన్ని సోమేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లు తరిణి సోమేశ్వరరావు, ఆనల అప్పారావు, కంచరాన లేపాక్షి, నందిగాం అశోక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో పాఠశాలన్నీ అభ్యసన కేంద్రాలుగా మార్చి పున:వ్యవస్థీకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, అందులో భాగంగానే క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అన్నారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన అభ్యసన శిక్షణలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం 235 స్కూల్ కాంప్లెక్స్ ఉండగా, వాటిని తగ్గించి 170 క్లస్టర్ కాంప్లెక్స్‌లుగా మార్పు చేశామన్నారు. సిఆర్‌ఎంటిల ఆధ్వర్యాన 9,391 మంది ఉపాధ్యాయులకు పున:వ్యవస్థీకరణపై శిక్షణ ఇస్తామన్నారు. గతంలో స్కూల్ కాంప్లెక్స్ పేరుతో రెండు, మూడు రోజులు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రతి మూడో శనివారం మధ్యాహ్నం ఒక్కపూట మాత్రమే క్లాంపెక్స్ నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే చర్చల్లో పాత క్లాంప్లెక్స్, జిఒ నంబరు 117 రద్దు, వచ్చేయేడాది జూన్‌లో నిర్వహించనున్న అడ్మిషన్లు, డ్రాపౌట్లు, తరగతి గదుల్లో వెనుకబడిన విద్యార్థులకు స్టార్ కేటాయింపు వంటి అంశాలపై క్లస్టర్ కాంప్లెక్స్ మాట్లాడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌జిటి ఉపాధ్యాయులకు రెండు జామ కాయలను తెప్పించి నాలుగు భాగాలుగా విభజించి బోధిస్తూ... ఉపాధ్యాయుల అభ్యసన తీరు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్. శ్రీనివాసరావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.చిన్నం నాయుడు, సిఆర్‌పి శేషగిరి పాల్గొన్నారు.



పలాస : మాట్లాడుతున్న డిఇఒ తిరుమల చైతన్య

కవిటి: దిగువ శ్రేణి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి బోధన కొనసాగించాలని ఎంఇఒ ధనుంజయ్ మజ్జి సూచించారు. మండలంలోని బొరివంక, కవిటి, మాణిక్యపురం, బెలగాం, రాజపురం, ముత్యాలపేట పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. జి.జానకిరావు, జగన్నాథ్ దోళై డిఆర్‌పిలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రగతి, సకాలంలో తరగతుల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ కల్పించారు. ్ సిఆర్‌ఎంటి బి.తులసి, అబ్జర్వర్ ఎల్.కృష్ణ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: ఉపాధ్యాయులు తమ విజ్ఞానాన్ని పంచుకునే వేదికలుగా పాఠశాల సముదాయ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని బోరుభద్ర స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పి.రామకృష్ణ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోరుభద్ర పరిధిలోకి వచ్చే అన్ని పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల సముదాయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు, ధనుంజయరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్కలి : క్లస్టర్ సముదాయాల్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ దాసుపురం చిన్నారావు కోరారు. మండలంలో నర్సింగపల్లి, చాకిపల్లి పాఠశాలల్లో నిర్వహిస్తున్న క్లస్టర్ సముదాయాలను పరిశీలించారు.

ఇచ్ఛాపురం : క్లస్టర్ సముదాయాలను ఎంఇఒ–2 విశ్వనాథం పరిశీలించారు. మండలంలోని స్థానిక బాలికల, పురుషోత్తపురం, రత్తకన్న, కొలిగాం, ఈదుపురం, లొద్దపుట్టి, డొంకూరు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.



అనకాపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి విజయ గౌరి

అవకాశమివ్వండి.. మీ గళం వినిపిస్తా..

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే చట్టసభల్లో ఉపాధ్యాయుల గొంతు వినిపిస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శనివారం ఆమె అనకాపల్లిలోని చినబాబు కాలనీ, గుండాల వీధి తదితర ప్రాంతాల్లో ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుల పిఆర్‌సి సమస్యపైనా, హక్కులు, విద్యా రంగ పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తనను బలపరుస్తున్నట్టు తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పని చేసి, ప్రస్తుతం అభ్యర్థులుగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి అధికార పార్టీ ప్రభుత్వాలతో అంటకాగారని, ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి వారి సొంత ప్రయోజనాల కోసమే పని చేశారని గుర్తు చేశారు. అటువంటి వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉపాధ్యాయులు, ఉద్యోగుల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించారని, అటువంటి పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు.

'స్వచ్ఛ' జిల్లాగా తయారు చేద్దాం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



చెత్తను వేరు చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మూడు రకాల చెత్తలను జిల్లా ప్రజలు వేరు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం కింద శుభ్రం చేసే పనిలో భాగంగా ప్రతినెల మూడో శనివారం నిర్వహించే కార్యక్రమంలో కలెక్టరేట్ వద్ద శనివారం తడి, పొడి, హానికరమైన చెత్తలను ఆయన వేరు చేసి మున్సిపల్ కార్పొరేషన్ వాహనంలో వేశారు. అక్కడ పనిచేసే సిబ్బందికి తడి, పొడి, హానికరమైన చెత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో నివశిస్తున్న ప్రజలు మీ మీ గృహాల్లో వినియోగించే వస్తుల్లో పనికిరాని చెత్త తీసివేసినప్పుడు తడి, పొడి, హానికరమైన చెత్తలను వేరు చేసి సంబంధిత డస్టిన్‌ల్లో వేసి శానిటరీ సిబ్బంది ఇంటింటికి వచ్చినప్పుడు అందజేయాలని కోరారు. తడి, పొడి చెత్తలను వేరు చేస్తేనే ప్రాసెసింగ్ చేయొచ్చన్నారు. తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయడం, కంపోస్టు, వర్మీకంపోస్టు తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న రైస్‌మిల్లు కార్మికులు

రైస్‌మిల్లు కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి- మందస

రైస్‌మిల్ కార్మికుల సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిద్ధూరు రైస్ మిల్లుల ఆవరణలో శనివారం సమ్మె శిభిరం వద్ద మోకాళ్లపై నిల్చొని అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కె.కేశవరావు, రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.బాలకృష్ణ, బి.దుర్యోధన మాట్లాడుతూ వేతన ఒప్పందం అయ్యేవరకూ పోరాటం సాగుతుందని తెలిపారు. సోమవారం నుంచి పోరాటం మరింత ఉధృతం చేస్తామని అన్నారు. యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేష్, ఆర్.ఏకాశి, పి.కూర్మారావు, ఎన్.లచ్చయ్య, జి.భాగ్యలక్ష్మి, ఆర్.తేజ పాల్గొన్నారు.

సివిల్ లైబిలిటీ యాక్టు సవరణతో తీవ్ర నష్టం

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు



మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి లొంగిపోయి సివిల్ లైబిలిటీ యాక్టును సవరించడం తీవ్ర నష్టమని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీనియర్ నాయకులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. మండల సిపిఎం నాయకులు హనుమంతు ఈశ్వరరావు అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సివిల్ లైబిలిటీ యాక్టు సవరించడం వల్ల అణు ప్లాంట్ ప్రమాదాలు సంభవిస్తే వాటికి నష్టపరిహారం చెల్లించే బాధ్యత నుంచి కంపెనీలు తప్పుకుంటాయని పేర్కొన్నారు. రణస్థలం మండలం కొవ్వాడ అణుపార్కు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గుజరాత్ రాష్ట్రం మితివిర్తిలో పెట్టాల్సిన అణువిద్యుత్ కేంద్రాన్ని అక్కడ ప్రజలు వ్యతిరేకిస్తే కేంద్ర ప్రభుత్వం అక్కడ రద్దు చేసి కొవ్వాడకు తరలించారని విమర్శించారు. రాష్ట్ర శాసనసభలో కొవ్వాడ అణుపార్కుకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతనీ పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ప్రజలకు వివరించారు. అలాగే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని పలువురు రైతులు మంత్రికి కోరగా, త్వరలో రైతులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామని రైతులకు చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ బద్రత కల్పించాలని అసోషియేషన్ ప్రతినిధులు కోరారు, పలు గ్రామాలకు వైద్య సదుపాయాలు కల్పించాలని మంత్రిని విన్నవించారు. గ్రామ మత్స్య సహాయకులుగా పనిచేస్తున్న తమకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఎన్‌టిఆర్ వైద్య సేవల్లో విధులు నిర్వహిస్తున్న తమకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, నాలుగు మండలలా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే నందిగాం మండలం బోరుభద్ర పంచాయతీ కంచివూరుకు శ్మశానవాటికలకు సిసి రోడ్లు, వీధుల్లో డ్రెయినేజీల నిర్మించడంతో టిడిపి నాయకులు మంత్రికి అభినందనలు తెలిపారు. అనంతరం ఇజ్జావరానికి చెందిన బి.జయరాంకు రూ.పది లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు.

వ్యవ'సాయం' విస్మరించి అభివృద్ధి గొప్పలు

వీక్షణం

ప్రజాశక్తి–శ్రీకాకుళం ప్రతినిధి

కూటమి ప్రభుత్వ నేతల మాటలు కోటలు దాటుతున్నా, పనులు గడప దాటడం లేదు. వ్యవసాయంలో అంత జిడిడిపి సాధిస్తాం, ఇంత ఆదాయం సాధిస్తామంటూ ఐదేళ్లకు ప్రణాళికలు రూపొందించిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రస్తుతం రైతుల అవసరాలను తీర్చే విషయాన్ని విస్మరిస్తోంది. ఖరీఫ్‌లో పండిన పంటను కొనుగోలు చేయలేక రైతులను దళారుల దయాదాక్షిణ్యాలకు వదిలేసిన ప్రభుత్వం రబీలో నీరివ్వలేక చేతులెత్తేసింది. 2014–19 అధికారంలోకి వచ్చిన టిడిపి వంశధార ప్రాజెక్టు ఫేజ్–2 స్టేజ్–2 పనులను తన ఐదేళ్ల కాలం లో పూర్తి చేయలేకపోయింది. 2019–24 వరకు అధికారంలో ఉన్న వైసిపి హయాంలో పనులు పూర్తి కాలేదు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం 2025–26 నాటికి పూర్తి చేస్తామని చెప్తోంది. ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే హిరమండలం రిజర్వాయర్‌లో 19 టిఎంసిల నీరు నిల్వకు అవకాశం ఉంది. నీటి ఖరీఫ్, రబీ పంటలకు పుష్కలంగా నీరివ్వొచ్చు. రబీలో వరి వేయొద్దని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పాల్సిన దుస్థితి వచ్చేది కాదు. తమ ప్రాంతాలకు వంశధార నీటిని వదలాలని మంత్రి అచ్చెన్నాయుడుని రైతులు బతిమిలాడుకోవాల్సిన పరిస్థితి కూడా వచ్చేది కాదు. రబీలో సాధారణంగా అన్ని రకాల పంటలు కలిపి మొత్తం 1,98,493 ఎకరాల్లో సాగయ్యే పరిస్థితి ఉండగా ప్రస్తుతం 1,29, 695 ఎకరాల్లోనే (65 శాతం) రైతులు పంటలు వేయగలిగారు. రబీలో వరి సాధారణ సాగు 21,573 ఎకరాలు ఉండగా ప్రస్తుతం 10,208 ఎకరాల్లో (47శాతం) మాత్రమే వేయగలిగారు. ఖరీఫ్‌లోనూ రైతులు ఇవే అనుభవాలను ఎదుర్కొన్నారు. వర్షాలు లేక వంశధార, నాగావళి నదులు ఎండిపోవడంతో కాలువల నుంచి చుక్క నీరు కూడా రాని పరిస్థితి నెలకొంది. వర్షాభావ పరిస్థితులు, వంశధార కాలువల ద్వారా పూర్తి స్థాయిలో నీటిని విడిచిపెట్టకపోవడంతో పంటలూ ఎండిపోయాయి. కనీసం పంట కాలువలనూ రిపేర్లు చేయలేకపోయారు.

ప్రభుత్వం నుంచి రైతులకు ఏ విధమైన సాయం లేకపోయినా ఖరీఫ్ చివరిలో వాతావరణ పరిస్థితులు కొంత అనుకూలించడంతో ధాన్యం దిగుబడి కాస్తా బాగానే వచ్చింది. చివరి గింజ వరకు కొంటామంటూ వ్యవసాయ మంత్రి గొప్పగా ప్రకటించినా చి'వరి'లో మాత్రం చేతులెత్తేశారు. పండిన ధాన్యంలో ఇప్పటివరకు 64 శాతం మేరే సేకరించి మిగిలిన ధాన్యం కొనుగోలు కోసం రైతులు ఎదురు చూసేలా చేశారు. జిల్లాలో 2024 ఖరీఫ్ సీజన్‌లో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల అవసరాలు, తిండి గింజలకు పోను 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు మార్కెట్‌లోకి రావొచ్చని భావించి 4.90 లక్షల టన్నులను సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు 4.80 లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే కొనుగోలు చేసి లక్ష్యం పూర్తయిన మండలాల్లో సేకరణ ఆపేశారు. రైతులు వద్ద ఇప్పటికీ వేల టన్నుల ధాన్యం ఉండిపోవడంతో ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుందా అని కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.


పంటలకు నీళ్లివ్వకుండా, పండిన పంటను కొనుగోలు చేయకుండా వ్యవసాయంలో ఐదేళ్లలో రెండింతల జిడిపి సాధిస్తామంటూ ప్రభుత్వం గొప్పలు చెప్తోంది. జిల్లాలో వ్యవసాయం, అనుబంధ రంగాల ద్వారా ప్రస్తుతం రూ.12,376 కోట్ల జిడిడిపి వస్తుండగా 2028–29 నాటికి రూ.25,416 కోట్ల లక్ష్యం సాధిస్తామని ప్రభుత్వం తన విజన్ ప్లాన్‌లో పేర్కొంది. ఈ సంవత్సరం రైతుల ఆదాయం పెరగకుంటే ఈ ఎడాది జిడిపి వాటా తగ్గినట్టే. ప్రస్తుతం రైతులు కోరుకుంటున్న సాగు నీరు, పండిన పంటను కొనుగోలు చేయడం, పంటలకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం మాని ఐదేళ్లలో అంతా అభివృద్ధి చేసేస్తామని చెప్పడం అరచేతిలో వైకుంఠం చూపించడమే అవుతుంది.



చెరువులో బోల్తా పడిన స్కూల్ బస్

చెరువులో స్కూల్ బస్ బోల్తా

మందస: మండలంలోని ఉమాగిరి వద్ద ఉన్న చెరువులో ప్రయివేటు స్కూల్ బస్ శనివారం సాయంత్రం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు చిన్నారులు స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు చెరువులో దిగి చిన్నారులను బయటకు తీసి హరిపురం పిహెచ్‌సికి తరలించారు. ఈ సమయంలో 35 మంచి చిన్నారులు ఉన్నారు. మందసలోని విద్యావివేకానంద స్కూల్ నుంచి బురాసింగి వెళ్తుండగా.. ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. అలాగే ఎంఇఒ లక్ష్మణరావు ఘటనాస్థలనికి వెళ్లి పరిశీలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే బస్ బోల్తా పడిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఎస్ఐ కృష్ణప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న చిన్నారులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


లావేరు : చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ, డిఆర్‌డిఎ పీడీ


ఇచ్ఛాపురం : అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రమేష్


అరసవల్లి : గ్రంథాలయ పరిసరాలు శుభ్రం చేస్తున్న అధికారులు



బూర్జ: ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాశక్తి- లావేరు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, ఇంటిలో వాడే తడి,పొడి చెత్త ద్వారా కంపోస్టు తయారు చేసి పెరటలో కూరగాయల మొక్కలు, ఆకుకూరల మొక్కలకు ఉపయోగించాలని జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రం లావేరు, తాళ్లవలస పంచాయతీల్లో స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లావేరు, తాళ్లవలస పంచాయతీ సుభద్రపురంలో క్లిన్‌అండ్ గ్రీన్ నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాల న్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, ఎపిఎంఐపి పీడీ శ్రీనివాస్, ఎంపిడిఒ పి.వెంకటారాజు, ఇఒపిఆర్‌డి వి. విశ్వేశ్వర రావు, తాళ్లవలస మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీ మోహన్, సాగునీటిసంఘం అధ్యక్షుడు ముప్పిడి శ్రీనువాసరావు, ఎపిఎం బి.వి.సుబ్బాయ్యనాయుడు, కార్యదర్శి దాలినాయుడు, కెల్ల రామకృష్ణ, ఆరోగ్య సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇచ్ఛాపురం పురపాలక సంఘ పరిధిలో పరిశుభ్రతపై విద్యార్థులకు, మహిళా సంఘాలకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అరసవల్లి: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి.కుమార్ రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్ శంకరరావు, కె.ప్రత్యూష, పి.వరలక్ష్మి, యు.కళ్యాణి, పి.రామ మోహన్ గ్రంథాలయ ఆవరణలో చెత్తను తుడిచి, పిచ్చి మొక్కలు తొలగించారు. సిబ్బంది, పాఠకులతో ప్రతిజ్ఞ చేయించారు.

అలాగే ప్రభుత్వ మహిళా కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. ముందుగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, వృక్షశాస్త్ర విభాగాధిపతి, ఎస్.రుద్రమరాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి: పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పేడాడ రాజేశ్వరరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్ వి జె విద్యాసంస్థల్లో విద్యార్థులు పరిసరాలు పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ పిఒ జె పాపారావు, అధ్యాపకులు జి.విష్ణుమూర్తి, పి.హరిబాబు, బి.అంజన, డి.రమేష్, ఎల్.ఆనంద్, లోకేశ్వరరావు, ఎస్.వి.జె డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పలాస: పలాస, కాశీబుగ్గ పురపాలక సంఘంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు పాల్గొన్నారు. అందులో భాగంగా పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న అన్న క్యాంటీన్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేయించారు. అలాగే మున్సిపల్ కార్యాలయం పరిసరాలను పరిశుభ్రం చేశారు. మండలం రెంటికోట గ్రామంలో సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో ఎంపిడిఒ కె.వసంత కుమార్, మండల పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, విద్యాశాఖాధికారులు సిహెచ్ శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం, మండలస్థాయి అధికారులు పర్యటించి పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ శాసనపురి తిరుమలరావు, కార్యదర్శి సద్గుణ బాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పలాస వెలుగు కార్యాలయంలో వెలుగు సిబ్బంది కార్యాలయాన్ని, పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎపిఎం జాంబవతి, అప్పల నర్సమ్మ, రాము కళ్యాణి రామారావు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: డోకులపాడు సచివాలయం ఆవరణం, రోడ్డుకు ఇరువైపుల స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎపిఎం గొడబ ప్రసాదరావు అధ్యక్షతన స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ధనుంజయ్, మహిళా పోలీస్ హేమ, వెటర్నరీ అసిస్టెంట్ వాసు, లోహితీ ఈశ్వర్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పాతపట్నం: ప్రతిఒక్కరూ తమ ఇంటికి ఇంకుడు గుంతను తప్పనిసరిగా నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్రాలో భాగంగా మండలంలోని పేడూరులో ఇంకుడు గుంతల నిర్మాణాలను ఎంపిడిఒ చంద్రకుమారితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వెంకటరావు, ఎపిఒ సురేష్, కార్యదర్శి షణ్ముఖరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : స్వచ్ఛాంధ్రాలో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, సిబ్బంది తమ కార్యాలయం, రైతు బజారు వద్ద అవాగాహన, శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పోల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ బి.కరుణశ్రీ మాట్లాడుతూ తడి, పొడి, హానికర చెత్తలకు మూడు రకాల డస్ట్ బిన్స్ ఏర్పాటు చేశామని అందులో వేయాలని సూచించారు. అనంతరం విక్రయాదారులు, రైతులు వద్ద ప్రతిజ్ఞ చేయించారు.

బూర్జ: స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యాశాఖ అధికారి శివ్వాల తవిటినాయుడు ఆధ్వర్యంలో కళాశాల పరిసరాలను సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ అధికారులు శుభ్రం చేశారు. ముందుగా ప్రతిజ్ఞ చేశారు. ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పిఒ ఠాగూర్, ఎంపిడిఒ తిరుపతిరావు, గార శశిధర్, ఉపాధ్యాయులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: అంటురోగాల వ్యాప్తిని అరికట్టేందుకు బహిరంగ మలవిసర్జనను నిర్మూలించాలని ఎంపిడిఒ మీసాల మన్మధరావు, మేజర్ పంచాయతీ ఇఒ మోహన్‌బాబు అన్నారు. పట్టణంలో పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కవిటి : పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న విద్యార్థులు


పలాస : మున్సిపాలిటీ కార్యాలయం వద్ద చీపురుతో ఊడుస్తున్న కమిషనర్


శ్రీకాకుళం : అవగాహన కల్పిస్తున్న కరుణశ్రీ


పొందూరు : అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజు అన్నారు. మండలంలోని చాపర సచివాలయం వద్ద స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒం నరసింహ ప్రసాద్ పండా పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న మురళీకృష్ణ

మంత్రిని కలిసిన రైస్‌మిల్లర్లు

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ కోరారు. వైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులుతో కలిసి కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా ఇబ్బందులు ఉన్నాయని, మిల్లర్లు సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించి మిల్లర్లు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అధ్యక్షులు బోయిన రమేష్ ఉన్నారు.


పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వంతెన పనులు వేగవంతం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని గొల్లూరు వద్ద వంశధార ఎడమ ప్రధాన కాలువపై జాతీయ రహదారి నుంచి రాంపురం కూడలిన వంతెనను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించారు. ఈ వంతెన పనులను ఉపాధి హామీ నిధులతో నిర్మించాలని ఇఇ శేఖర్‌రావుకు ఆదేశించారు. వంశధారపై ప్రస్తుతం ఏర్పాటు చేసి ఉన్న కాళిబాట వంతెన పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ వంతెన 2023 ఏప్రిల్ 24న కూలిందని, రెండేళ్లు అవుతున్నా నిర్మించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈయనతో పాటు ఎఇ భాస్కరరావు, తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపిడిఒ టి.రాజారావు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

పాతపట్నం: మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణంలో పాతపట్నం సిఐ వి.రామారావు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ కె.కృష్ణారావు, మెళియాపుట్టి, హిరమండలం ఎస్ఐలు బి.లావణ్య, మహమ్మద్ యాసిన్‌లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీమార్గమే రాజ మార్గంగా చేసి పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను రాజీపరిచే విధంగా చేయాలని సూచించారు.


సర్వేపై సూచనలు చేస్తున్న జడ్జి జ్యోత్స్న

పారదర్శకంగా వికలాంగుల గుర్తింపు

పొందూరు: వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అందిస్తున్న ప్రయోజనాల లబ్ధిని పొందాలంటే వికలాంగుల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. పొందూరు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం వికలాంగుల సర్వేపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వికలాంగ చిన్నారులను గుర్తించి, వారి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పొందూరు, జి.సిగడాం మండలాలకు చెందిన ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను ప్రయోగశాలగా మార్చేశారు

టెక్కలి: ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఉపాధ్యాయులపై, విద్యావ్యవస్థపై విధానపరమైన నిర్ణయాలు, ఉన్నతాధికారుల వైఖరిలో మార్పు లేదని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బొడేపల్లి నేతాజీరావు విమర్శించారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. నిరంతరం విద్యా విధానాల రూపకల్పన పేరుతో ప్రయోగాల శాలగా మార్చేరని అన్నారు. గత ప్రభుత్వంలో తెచ్చిన 117 జిఒ వల్ల ప్రభుత్వ విద్యా రంగానికి పెను ప్రమాదం వాటిల్లిందని, దాని ఉపసంహరించుకోవాలని వంద రోజుల పోరాట కార్యక్రమం చేపట్టామని గుర్తు చేశారు. ఇప్పుడు క్లస్టర్ సమావేశాలు పేరుతో సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగించడం సరికాదన్నారు.

థర్మల్ పవర్ ప్లాంట్‌పై దశల వారీ ఉద్యమం

రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా బూర్జ-సరుబుజ్జిలి ప్రాంత భూముల్లో ప్రతిపాదిత థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా దశలవారిగా ఉద్యమించాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు తీర్మానం చేశారు. శ్రీకాకుళం నగరంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న ఓ కల్యాణ మండపంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, వైసిపి, సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. వచ్చే నెల ఐదు, ఆరు తేదీల్లో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు గ్రామాల్లో పర్యటించాలని నిర్ణయించారు. తొలుత యోగి మాట్లాడుతూ థర్మల్ ప్లాంట్ నిర్మాణంతో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సోలార్ విద్యుత్ వంటి ప్రత్యమ్నాయాలు ఉండగా థర్మల్ ప్లాంట్లతో పనేమిటని ప్రశ్నించారు. వైసిపి ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మాట్లాడుతూ.. థర్మల్ ప్లాంట్ పేరుతో ఆదివాసీలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జిల్లా ప్రజల నెత్తిన థర్మల్ ప్లాంట్ రుద్దాలని చూస్తోందని, ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి కృష్ణారావు, న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.వి.జగన్నాథం, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేష్, సోంపేట పోరాట కమిటీ నాయకులు బీల ఢిల్లీరావు, బిసి సంఘం నాయకులు చౌదరి లక్ష్మీనారాయణ, డిటిఎఫ్ గౌరవాధ్యక్షులు కోత ఎల్.ధర్మారావు, కెవిపిఎస్ నాయకులు బెలమల ప్రభాకర్, పోరాట కమిటీ అధ్యక్షులు సురేష్ దొర, ప్రధాన కార్యదర్శి రవికాంత్, మహిళా సంఘం అధ్యక్షులు కృష్ణవేణి, కాకరపల్లి పోరాట కమిటీ అధ్యక్షుడు హన్నురావు, తదితరులు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్లాంట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు



మొక్కను నాటుతున్న ఆర్‌డిఒ వెంకటేష్

మొక్కలు నాటాలి

పలాస: ప్రభుత్వ శాఖల అధికారులు తమ కార్యాలయాలు వద్ద మొక్కలు నాటాలని ఆర్‌డిఒ జి.వెంకటేష్ అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ అన్నా క్యాంటీన్, క్యాంటీన్ సమీపంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు వద్ద మొక్కలు నాటడం ద్వారా కార్యాలయం ఆహ్లాదంగా ఉంటుందన్నారు. స్వచ్ఛమైన గాలి, కార్యాలయానికి వచ్చిన ప్రజలకు నీడ ఇస్తుందన్నారు. మొక్కలు పెంచడంతో పర్యావరణం కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్తరాంధ్ర ఉద్యోగ బాధితుల సమావేశం

ఆమదాలవలస: ఉత్తరాంధ్ర ఉద్యోగ బాధితుల సమావేశం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో 2003 డిఎస్‌సి ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 16న శ్రీకాకుళం పట్టణంలోని కళింగ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ కొత్తకోట శ్రీహరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 1 జనవరి 2004 ముందు వివిధ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చిన అప్పటి ప్రభుత్వాలు వివిధ కారణాల వలన ఉద్యోగ నియామకాలను ఆలస్యం చేసి వివిధ కేటగిరీలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత ఫెన్షన్ అమలు చేయమని కేంద్రం విడుదల చేసిన మెమో 57ను రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో మూడు జిల్లాల బాధిత ఉద్యోగులు తప్పనిసరిగా హాజరు కావాలని ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ కొత్తకోట శ్రీహరి పిలుపునిచ్చారు.

పిఎసిఎస్ చైర్మన్ పదవికి పైరవీలు

మందస : పంట రుణాలు, ఎరువులు, సబ్సిడీపై యంత్ర పరికరాలు, టార్పిలిన్లు అందిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) మందస, బలిగాం చైర్మన్ల పదవి కోసం ఇప్పటి నుంచే పైరవీలు చేస్తున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో కూటమి నాయకుల మధ్య తీవ్ర చర్చలు నడుస్తుంది. మరోవక్క సీనియర్ నాయకులను పట్టించుకోకుండా ఎన్నికల సమయంలో రాత్రనకా, పగలనక ఎమ్మెల్యే గెలుపు కోసం కష్టపడిన నాయకులను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వెనుక వచ్చిన నాయకులకు నామినేటెడ్ పోస్టుల్లో ముందు ప్రాధాన్యత ఇస్తున్నారని పలువురు వాపోతున్నారు.

ప్రశాంతంగా సిబిఎస్‌ఇ పరీక్షలు

ఇచ్ఛాపురం: జ్ఞాన భారతి సిబిఎస్‌ఇ సీనియర్ సెకండరీ స్కూల్‌లో శనివారం సిబిఎస్‌ఇ టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సిబిఎస్‌ఇ బోర్డు నియమించిన ప్రత్యేకాధికారి పర్యవేక్షణలో ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షలో భాగంగా ఇంగ్లీష్ సబ్జెక్టు పరీక్ష నిర్వహించారు. మొత్తంగా 63 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు ఈ పరీక్షను నిర్వహించారు. పరీక్ష ప్రారంభానికి ముందు పాఠశాల సెక్రటరీ, సిఇఒ జోహార్ ఖాన్, పాఠశాల ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, మేనేజర్ ప్రమోద్ కుమార్, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు విషెస్ అందించారు. వారికి పెన్నులను బహుకరించారు. ఈనెల 21 నుంచి 12వ తరగతి బోర్డు పరీక్షలు ప్రారంభం కానున్నాయని కార్యదర్శి జోహార్ ఖాన్ తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అభివృద్ధి పనులు వేతవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశించారు. స్థానిక జిల్లా ఆస్పత్రికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్డుకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని వంశధార అధికారులకు సూచించారు. అనంతరం టెక్కలిలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త సంపద కేంద్రం నిర్వహణపై అధికారులతో, సిబ్బందితో మాట్లాడారు. తడి, పొడి చెత్త అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు టెక్కలి మేజర్ పంచాయతీ సిబ్బంది పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులు చాలకపోవడం వల్ల చెత్త పేరుకుపోతుందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే శ్మశాన వాటికను పరిశీలించారు. అక్కడ ఎల్ఇడి బల్బులు లేవని స్థానికులు చెప్పడంతో తక్షణమే వాటిని ఏర్పాటు చేయాలని ఇఒకు ఆదేశించారు. పట్టుమహాదేవ కోనేరు గట్టు పరిశీలించి రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మండల ఇంజినీర్‌కు ఆదేశించారు. ఈయనతో పాటు డిపిఒ భారతీసౌజన్య, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, ఎంపిడిఒ లక్ష్మీభాయి, వంశధార ఇఇ శేఖర్, పంచాయతీ ఇఒ కె.వి.వి.జగన్నాథరావు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


కోటబొమ్మాళి : మాట్లాడుతున్న త్రినాథరావు


ఐడి నమోదు తప్పనిసరి

కోటబొమ్మాళి: రైతులు వారివారి గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలను సంప్రదించి రైతు గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. మండలంలోని హరిశ్చంద్రపురం రైతు సేవా కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాల లబ్ధి కోసం భూమి ఉన్న ప్రతి రైతు ఈ గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలన్నారు. రైతుకు 11 అంకెలతో కూడిన ఒక నంబరు ఇస్తారని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు ఉన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని ప్రతి రైతూ ఫార్మర్ ఐడి కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ భార్గవి తెలిపారు. మండలంలోని మండపల్లి, కేదారిపురం, బాలకృష్ణాపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో చేపడుతున్న ఫార్మర్ ఐడి రిజిస్ట్రేషన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ రిజిస్ట్రేషన్ వల్ల పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీపై విత్తనాలు, క్రాప్ ఇన్సూరెన్స్, బ్యాంకు నుంచి పంట రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మ సేద్య పరికరాలకు ఉపయోగం ఉంటుందన్నారు. రైతులు మీ వ్యవసాయ సహాయకులు సంప్రదించి ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

వజ్రపుకొత్తూరు: పంచాయతీ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావు తెలిపారు. మండలంలోని సీతారాపురంలో చేపడుతున్న తాగునీటి బావి అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే గౌతు శిరీష సహకారంతో పంచాయతీలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 65 ఏళ్ల క్రితం నిర్మించిన తాగునీటి బావి ఇప్పటికీ గ్రామస్తుల అవసరం తీరుస్తుందని తెలిపారు. బావి లోపలి పాకు పట్టకుండా ఉండేందుకు గోడలను చెక్క సున్నం చేస్తున్నామని తెలిపారు. నంద ఎత్తు పెంచడం, ప్లాటఫారం ఎత్తు పెంచుతున్నామని అన్నారు. నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గ్రామాభివృద్ధికి టిడిపి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని నాయకుడు బమ్మిడి సూర్యనారాయణ అన్నారు.


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఢిల్లీరావు


ఇచ్ఛాపురం : వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

గంజాయితో పలువురు అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన మిలాస్ పరిచ్చా అనే వ్యక్తి అక్రమంగా అక్రమంగా గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామని డిఎస్‌పి పి.వెంకట అప్పారావు, సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఆయన వద్ద నుంచి 6.220 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద శనివారం అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పాల్గొన్నారు.

పలాస : పలాస రైల్వేస్టేషన్ కేంద్రంగా రెండు వేర్వేరు కేసుల్లో అక్రమంగా గంజాయి రవాణాకు పాల్పడుతున్న నలుగురు నింధితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 11.56 కిలోల గంజాయిని, మూడు సెల్‌ఫోన్లు రూ.3 వేలు నగదును స్వాధీనం చేసుకున్నామని డిఎస్‌పి వి.వెంకట అప్పారావు తెలిపారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా చెందిన చెందిన బిక్రమ్ మండల్, సునందనసబర్లు, ఉదయకుమార్, గౌరవ్ పొరిదాలు బ్యాగ్‌ల్లో తరలిస్తుండగా కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ పట్టుకుని అరెస్టు చేశారని అన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి సమీపంలోని తోటల్లో యువకులు గంజాయి తాగుతూ ట్రాస్క్ పోర్స్ పోలీసులకు పట్టుబడ్డారు. అనుమానిత యువకులనుఅదుపులోకి తీసుకున్న పరిశీలించి గంజాయి ఆనవాలను స్వాధీనం చేసుకుని టెక్కలి పోలీసులకు అప్పగించారు. దీనిపై పూర్తి స్థాయిలోదర్యాప్తు చేపట్టి వివరాలు వెల్లడిస్తామని సిఐ ఎ.విజయకుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల


మృతిచెందిన నవీన్

ఎచ్చెర్ల జాతీయ రహదారిపై కుశాలపురం బైపాస్ సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సవర నవీన్ (21) మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన నవీన్ అక్కడికక్కడే మృతి చెందగా బైక్ వెనుక కూర్చున్న కళ్యాణి అనే యువతికి గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఇరువురిని శ్రీకాకుళం సర్వోజనాస్పత్రికి తరలించారు. పోలీసుల వివరాల మేరకు నవీన్ సొంత ఊరు సీతంపేట మండలం కుడ్డపల్లి. తండ్రి అనప హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల మరణించాడు. తల్లి లక్ష్మి. నవీన్‌కు ఇటీవల కళ్యాణితో ఎంగేజ్‌మెంట్ జరగ్గా కల్యాణి విజయవాడ నుంచి విశాఖపట్నం రావడంతో నవీన్ కల్యాణిని రిసీవ్ చేసుకుని తిరిగి వస్తున్న నేపథ్యంలో కుశాలపురం బైపాస్ సమీపంలో ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే నవీన్ మృతిచెందగా కళ్యాణికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మన్నారు.

ట్రాక్టర్ బోల్తా : వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస / పొందూరు


భాస్కరరావు (ఫైల్)

ఆమదాలవలస మండలంలోని బెలమాం గ్రామం వద్ద ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే పొందూరు మండలం తాడివలసకు చెందిన తమ్మినైన భాస్కరరావు (55) ఆమదాలవలస మండలం బెలమాం గ్రామం వద్ద ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో మృతి చెందాడు. మృతుడికి భార్య రమణమ్మ, ఇరువురు కుమార్తెలు, కుమారుడు దిలీప్ ఉన్నారు. ఇరువురు కుమార్తెలకు వివాహం కాగా కుమారుడు దిలీప్ డిగ్రీ చదువుతున్నాడు. గతేడాది ఏప్రిల్‌లో వ్యవసాయ పనుల నిమిత్తం భాస్కరరావు ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. అప్పటినుంచి చుట్టుపక్కల గ్రామాల ప్రజల పొలం పనులకు, కౌలుకు తీసుకున్న ఎనిమిది ఎకరాల సొంత వ్యవసాయ పనులకు ట్రాక్టర్‌ను వినియోగిస్తూ కాలం వెళ్లదీసేవాడు. శనివారం ఉదయం పొందూరు మండలం బొడ్డేపల్లి గ్రామం వద్ద నున్న తన సొంత వ్యవసాయ భూమిలో దుక్కు పట్టేందుకు సొంత గ్రామం తాడివలస నుంచి ఉదయం ఐదు గంటల సమయంలో ట్రాక్టర్‌పై బయలుదేరి వెళ్తుండగా ఆమదాలవలస మండలం బెలమాం వద్ద ట్రాక్టర్ బోల్తా పడడంతో ట్రాక్టర్ చక్రాల కింద నలిగి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సనపల బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

తాడివలసలో విషాదం

పొందూరు మండలం తాడివలసలో భాస్కరరావు మృతి చెందిన విషయం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలో అందరితో కలివిడిగా సరదాగా గడిపే వ్యక్తి వివాదరహితుడుగా ఉండే భాస్కరరావు మృతి చెందడం తీరని లోటని పలువురు కన్నీటి పర్యంత మయ్యారు.

రైలులో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

తిరుపతి-పూరీ రైలులో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పలాస రైల్వే ఎస్ఐ ఎస్.కె.షరీఫ్ తెలిపారు. విశాఖట్నం వద్ద రైలు ఎక్కిన 40 ఏళ్ల వయసు కలిగిన ఈ వ్యక్తి తప్పతాగి ఉన్నాడని, పలాస రైల్వే స్టేషన్ వచ్చేసరికి మృతి చెందినట్లు ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. దీంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయనకు చెందిన వివరాలు ఏవీ లభించలేదన్నారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని కొరసవాడకు చెందిన బొమ్మాళి నీలయ్య ఒడిశా రాష్ట్రానికి చెందిన నాలుగు నాటు సారా ప్యాకెట్లతో అక్రమంగా తరలిస్తుండగా... నీలమణి దుర్గ ఆలయం సమీపంలో అరెస్టు చేశామని ఎక్సైజ్ సిఐ కోట కృష్ణారావు శనివారం తెలిపారు. అనంతరం కోర్టులో హాజరుపరిచామన్నారు. నాటుసారా నియంత్రణకు టోల్ ఫ్రీ నంబరు 14405కి ఫోన్ చేసి సహకరించాలన్నారు.


తరగతి గదిని పరిశీలిస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

పాఠశాల సందర్శన

నందిగాం : మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఇఒ ఎస్.తిరుమల చైతన్య శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రార్థన, తరగతుల నిర్వహణ, పరిసరాలను నిశితంగా పరిశీలించారు. ఆనంతరం పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీ ఫైనల్ పరీక్షలను పర్యవేక్షించారు. పాఠశాలల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు ప్రశ్నలు అడిగి వారికి ప్రోత్సాహకంగా నగదు బహుమతిని అందించారు. ప్యానల్ బోర్డు ద్వారా ఆంగ్లం చదివింపు విషయంలో ఉపాధ్యాయులు గోవిందరావుని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి రాగి జావని తాగారు. పాఠశాల నిర్వహణ, వంటతీరు విద్యార్థుల ప్రవర్తనపై సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థుల ఫలితాలపై ప్రధానోపాధ్యాయకులు చిలుకు కృష్ణారావుతో సమీక్షించారు. ఈయనతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు రంకిడి రామారావు, తులసీప్రసాద్, బెందాళం రత్నం, ప్రియదర్శిని, గోవిందరావు, యాగాటి త్రినాదరావు, దుంపల సంధ్యారాణి ఉన్నారు.


డిక్లరేషన్ ఫారాలు ప్రదర్శిస్తున్న మాజీ సైనికుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

మాజీ సైనికుల సంక్షేమ సంఘ అధ్యక్షునిగా 'తాండ్ర'

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా తాండ్ర జనార్ధనరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ సభ్యులు విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ పి.ఎస్.రావు, విశ్రాంత సుబేదార్ గురుగుబెల్లి సత్యనారాయణ, విశ్రాంత సుబేదార్ మేజర్ బర్రి సంజీవ రావు, హానరరీ కెప్టెన్ జామి రమణయ్యలు శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ మాజీ సైనికుల సంక్షేమ సేవాసంఘం తరపున ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి ఫిబ్రవరి 12న రాత్రి 8 గంటల వరకు నామినేషన్‌లు స్వీకరించినట్లు తెలిపారు. గడువులోగా ఒకేఒక్క నామినేషన్ దాఖలు కావడంతో తాండ్ర జనార్ధనరావు ప్యానెల్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించి వారికి డిక్లరేషన్ ఫారాలను అందజేసినట్లు ఎలక్షన్ కమిటీ సభ్యులు తెలిపారు. అధ్యక్షునిగా తాండ్ర జనార్ధనరావు, ఉపాధ్యక్షునిగా పైడి సూర్యారావు, జనరల్ సెక్రటరీగా నానుపాత్రుని రామారావు, కోశాధికారిగా బొడ్డేపల్లి శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్‌గా పొన్నాడ శ్రీనివాసరావు ఉన్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు కటకం పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.


కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని జడూరులో ఎంపిటిసి గొండు చైతన్య మురళీ ఆధ్వర్యంలో శనివారం స్వర్గీయ గొండు భారతమ్మ జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి గొండు రామన్న, ఎంపిటిసి ప్రతినిధి గొండు మురళి, మాజీ సర్పంచ్ గొండు కేశవ, వైద్యులు సుభద్ర, మాధురి, పాల్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'వన్‌దన్'తో గిరిజన మహిళలకు ఉపాధి

మందస: వన్‌దన్ వికాస కేంద్రాలతో గిరిజన మహిళలకు ఉపాధి, ఆదాయం మెరుగుపడుతుందని సీతంపేట ఐటిడిఎ అదనపు పథక సంచాలకులు డాక్టర్ సన్యాసిరావు తెలిపారు. మండలంలోని కొండలోగాం పంచాయతీ జీడి పిక్కల ప్రాసెసింగ్ సెంటర్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని విడివికెలూ కండిషన్‌లో ఉండాలన్నారు. నిత్యం గిరిజనుల ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేస్తూ ఆదాయాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. రైతుల నుంచి జీడిపిక్కలను సేకరించి కేంద్రాలను నడిపించాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు ముఖలింగం, తారక మోహన్, రాజా, జగబందు, ఆనంద్ పాల్గొన్నారు.

అటెండెన్స్ కోసం పాట్లు


పొందూరు : హాజరు నమోదు కాలేదంటూ చూపుతున్న ఉపాధ్యాయులు

టెక్కలి : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యాన శనివారం ప్రయోగాత్మకంగా శనివారం క్లస్టర్ సముదాయాలు నిర్వహించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు అటెండెన్స్ కోసం నానాయాతనలు పడాల్సిన పరిస్థితి ఎదురైంది. ఎన్నడూ లేని విధంగా పాఠశాలల సముదాయాల స్థానంలో క్లస్టర్ సముదాయాలు పేరుతో శనివారం సముదాయాలు నిర్వహించారు. దీనికోసం ఉదయం పూట ఉపాధ్యాయులు పాఠశాలల్లో విధులు నిర్వర్తించి మధ్యాహ్నం పూట ఆయా పాఠశాలలోని క్లస్టర్ పరిధిలోని సముదాయాలకు హాజరు కావాలని విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఉపాధ్యాయులు రోజూ వేసే ఆటెండెన్స్ యాప్‌ని అప్‌డేట్ కూడా చేశారు. ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్న పాఠశాల్లో మధ్యాహ్నం అవుట్ నమోదు చేసుకుని కేటాయించిన క్లస్టర్‌కి వెళ్లి అక్కడ మరలా ఇన్ అటెండెన్స్ వేసినంత వరకు బాగానే ఉంది. యాప్ అవుట్ వేసే సమయంలో మాత్రం మొరాయించడంతో ఉపాధ్యాయులు అవస్థలు పడ్డారు. సాయంత్రం ఐదున్నర తర్వాత యాప్ వినియోగంలోకి వస్తాదని భావించి ఆంతవరకు వేచియున్న ఉపాధ్యాయులకు నిరాశ కలిగింది.


టెక్కలి ; అటెండెన్స్ యాప్ కోసం పాట్లు పడుతున్న ఉపాధ్యాయులు

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పాఠశాలల క్లస్టర్ కాంపెక్స్ సమావేశంలో ఆన్‌లైన్‌లో హాజరు పడకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 5 గంటల వరకూ క్లస్టర్ కాంపెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం ముగిసిన తరువాత ఆన్‌లైన్‌లో హాజరు వేయాల్సి ఉండగా 5.30 దాటినా సర్వర్ సరిగ్గా పనిచేయక హాజరు పడకపోవడంతో పడిగాపులు కాయాల్సి వచ్చింది. దీంతో సుమారు ఆరు గంటల వరకూ హాజరు కోసం వేచి చూడాల్సి వచ్చిందంటూ పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి వి.వి.అప్పారావు

పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పల్లెల్లో ప్రజలకు చక్కటి పోలీసు సేవలు అందించాలని కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు అన్నారు. ఈ మేరకు వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం రికార్డులను పరిశీలించారు. క్రైమ్ రికార్డులను, నమోదవుతున్న కేసుల వివరాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహనపై సూచనలు చేశారు. ఫిర్యాదుదారులపై మర్యాదగా నడుచుకోవాలని, ఎప్పటికప్పుడు ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిచాలని ఎస్ఐ బి.నిహార్‌కు ఆదేశించారు. బంగారం షాపుల్లో జరుగుతున్న చోరీలపై దృష్టిసారించాలన్నారు. దొంగతనాలను ఛేదించే పనిలో నిమగ్నం కావాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.


సన్మానిస్తున్న యువివి సభ్యులు

పాపారావుకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని నీలావతిలో ఉద్దాన విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యాన చేపడుతున్న గ్రంథాలయం వద్ద యువివి విద్యాభిమాని, నాటక రంగంలో అంతర్ రాష్ట్రస్థాయిలో పేరు పఖ్యాతలు పొందిన కళాకారుడు, వాయిద్యకారుడు, వామపక్ష భావజాలం కలిగిన వ్యక్తి, తొలితరం విద్యావంతుడు, ఉద్యోగి బచ్చల పాపారావు ఈ మేరకు యువివి అధ్యక్షులు బి.శివప్రసాద్ ఆధ్వర్యాన శనివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కుత్తుం ప్రకాశరావు, ఉపాధ్యక్షులు పి.గీతమ్మ, ఆర్థిక కార్యదర్శి జనగ సీతారామయ్య, అకడమిక్ సెల్ కన్వీనర్ కె.వినోద్, కె.సుధాకర్, టి.వాసుదేవరావు, కె.లింగమూర్తి, పి.మాధవరావు, నీలావతి, చిన్ననీలావతి పాల్గొన్నారు.

ఆధునిక దోబీ ఘాట్ల నిర్మాణానికి శ్రీకారం

పలాస: వెనుకబడిన తరగతుల వృత్తులను ప్రోత్సహించేందుకు ఆదరణ పథకం పునరుద్ధరిస్తూ రజక యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఆధునిక దోబీ ఘాట్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రజక సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు ఒక ప్రకటనల తెలిపారు. ధోబీ ఘాట్ల నిర్మాణానికి ప్రభుత్వం అనువైన ప్రభుత్వ స్థలాలు గుర్తిస్తుందన్నారు. ఆధునిక యంత్రాల ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తుందని అన్నారు. రజక వృత్తిదారులను ఇప్పటిదాకా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ నాయకత్వంలోనే భరోసా లభించిందన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణమే పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- అరసవల్లి

నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తేవాలని సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం, గార, శ్రీకాకుళం పట్టణంలోని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారుల ద్వారా సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చన్నారు. ఈ ప్రజా దర్బార్‌కు అధిక సంఖ్యలో ప్రజల వచ్చి సమస్యలపై వినతలు సమర్పించారు.


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ముగిసిన రహదారి భద్రతా మాసోత్సవాలు

ప్రజాశక్తి- అరసవల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శ్రీకాకుళం 1డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ముగింపు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం, టెక్కలి, పలాస డిపోలో ఎక్కువ కాలం ప్రమాద రహిత డ్రైవర్స్‌గా ప్రతిభ కనపరిచిన డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం రీజినల్ ట్రాన్స్‌ఫోర్ట్ అధికారి ఎం.ఎస్.ఎం.రాజు, పట్టణ డిఎస్‌పి వివికానంద్ ముఖ్య అతిధులుగా,హాజరై డ్రైవర్ల సేవలను కొనియాడారు, కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2, టెక్కలి, పలాస డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



డ్రైవర్లకు అవార్డులు అందజేస్తున్న అధికారులు

రాయితీ దుకాణం కేటాయింపుపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న శ్రీను

టెక్కలి : కల్లుగీత కార్మికులకు కేటాయించిన రాయితీ మద్యం దుకాణాలు కేటాయింపుపై చర్యలు తీసుకోవాలని కల్లుగీత చెందిన లబ్బ శ్రీను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్, జెసిలను కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. రిజర్వ్‌డ్ కల్లుగీత కార్మికుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం సబ్సిడీ దుకాణాన్ని మంజూరు చేస్తే సబ్సిడీ సొమ్ముని తమ సొంతానికి వాడుకుంటున్నారని అన్నారు.ఈ క్రమంలో కొందరు మద్యం వ్యాపారులు వ్యక్తులు కలిసి అవకతవకలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. టెక్కలిలో జనరల్ దుకాణం పొందిన వారే సబ్సిడీ కోసం ఆరాటం పడడం అన్యాయమన్నారు. ధరావత్తు డిడిలను పరిశీలిస్తే అవకతవకలు బయటపడతాయని అన్నారు. దీనిపై దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

నవధాన్యాల విత్తనాలు ఉంచుకోవాలి

ఆమదాలవలస : ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా సిబ్బంది రైతులతో నవధాన్యాల విత్తన సీడ్ ఫ్లాట్‌ను నిమ్మతొర్లాడలో వేయించారు. ఈ సందర్భంగా డిజిటల్ యల్‌టు సురేష్ మాట్లాడుతూ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యంలో పిఎండిఎస్ సీడ్ ప్లాట్‌ను రైతులతో వేయించినట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న ప్రతి రైతుకు నవధాన్యాల విత్తనాలు అందుబాటులో ఉండేలా క్షేత్రస్థాయిలో సీడ్ ఫ్లాట్స్ వేయిస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా సీడ్ ప్లాట్స్‌ను వేసుకోవడం వలన విత్తన కొరత ఉండదని తద్వారా నవధాన్యాల సాగు రైతులు సులువుగా చేపట్టడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృష్ణవేణి, రైతు చింతు సుధాకర్ పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేష్

ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస డివిజన్ పరిధిలోని పలు మండలాల లబ్దిదారుల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపించాలని ఆర్‌డిఒ జి.వెంకటేష్ అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో శనివారం సిఎం గ్రీవెన్స్, రెవెన్యూ, ప్రజాసమస్యల పరిష్కార వేదిక, ఆర్‌ఒ అప్పీళ్లు, సీనియర్ సిటిజన్ యాక్ట్ భూసమస్యలు తదితర అంశాలపై 8 ఫిర్యాదులు పరిష్కరించాల్సి ఉండగా, ఏడు ఫిర్యాదులు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులపై దృష్టిసారించి ఎప్పటికప్పుడు పరిష్కారం చూపించే దిశగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.


సైకిల్‌యాత్ర చేస్తున్న ఎమ్మా ఇన్లస్సియ

ఇటలీ యువతి సైకిల్ యాత్ర

కవిటి: ఇటలీదేశానికి చెందిన ఎమ్మా ఇన్లస్సియ ప్రపంచ దేశాల పర్యటనలో భాగంగా కోల్‌కత్తా నుంచి కేరళ వరకు సైకిల్ యాత్ర చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం కవిటి మండలం భైరిపురానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న దేశాల సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు తెలుసుకొనేందుకు తాను ఈ పర్యటన చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 951 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశానని మరో 1800 కిలోమీటర్లు యాత్ర చేయనున్నట్లు తెలిపారు.

'కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది'

కోటబొమ్మాళి: సూపర్ సిక్స్ అని ఎన్నికల్లో హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు ఆ హామీలు అమలుపరచకుండా గాలికివదిలేసిందని వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు అన్నారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడారు. తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు, రైతు భరోసా పేరుతో రైతుకు రూ.20 వేలు అందజేస్తామన్నారని అన్నారు. ఇప్పటి వరకు అవి అమలు చేయలేదన్నారు. చివరకు ధాన్యం పొలాల్లో ఉండిపోవడంతో కొనే నాథుడు లేక రైతన్నల గోష పెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, పేడాడ వెంకటరావు, నూక సత్యరాజు, బొడ్డు అప్పన్న పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం

పలాస : మండలంలోని మాకన్నపల్లిలో బావి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని శనివారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామంలో చాలా ఏళ్ల క్రితం నిర్మాణం చేసిన బావికు ఫ్లాట్‌ఫామ్ పాడవ్వడంతో పంచాయతీ నిధులతో మరమ్మతులు చేపట్టారు. ఈ సమయంలో సర్పంచ్ సైని దేసయ్య, ఎంపిటిసి కోరాడ నిరోష, ధనరాజ్ పేర్లు ధ్వంసం చేశారు. దీంతో సర్పంచ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఇటువంటి చర్యలకు పాల్పడటం దారుణమన్నారు.



ధ్వంసమైన శిలాఫలకం

గ్రంథాలయాల పునర్వికాస ఉద్యమం ప్రారంభం

ప్రజాశక్తి- అరసవల్లి

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్న గ్రంథాలయాలను అభివద్ధి చేయాలని నల్లి ధర్మారావు అధ్యక్షతన స్థానిక ఎన్‌జిఒ హోంలో గ్రంథాలయాల పునర్వికాస ఉద్యమం శ్రీకాకుళంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాల సెస్ గ్రంథాలయాల అభివృద్ధికి మాత్రమే ఖర్చు పెట్టాలని, ఇతర అవసరాలకు ఖర్చు పెట్టకూడదని డిమాండ్ చేశారు. గతేడాది రూ.731 కోట్లు గ్రంథాలయ సెస్ వసూలు అయినప్పటికీ అందులో కేవలం రూ.19 కోట్లు మాత్రమే గ్రంథాలయాల కోసం ఖర్చు పెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు విద్యా వికాసాన్ని అందించి విద్యార్థుల అభివృద్ధికి చేయూత నందించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రంథాలయాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కవులు వల్లూరి శివప్రసాద్, పెనుగొండ లక్ష్మీ నారాయణ, కేతవరపు శ్రీనివాస్, బలివాడ మల్లేశ్వరరావు, జామి భీమ శంకరరావు, పత్తి సునీత, చింతాడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సునీత